నిర్జీవ శవంలా పడిఉన్న దేహం నెమ్మదిగా కదిలింది.

నిట్టూర్పుతోబాటు, నొప్పివల్ల బయటకు వచ్చిన మూలుగు నిశ్శబ్దాన్ని భంగపరిచింది. రత్న నెమ్మదిగా కళ్ళు తెరచింది. మేలుకున్నతర్వాత ఒక క్షణంవరకూ రత్న కళ్ళకు అంతా శూన్యంగా, చీకటిగా కనపడింది. ఆమె మెదడు ఏమీ ఆలోచించలేనంతగా అలసిపోయింది. మెల్లిగా ఆమెను ఆవరించిన మబ్బు విడిపోసాగింది. తనకేమయింది? ఇంతవరకూ నిద్రపోయానా? లేదా ఏమైనా జబ్బు చేసిందా? ఉహూ......ఏమీ గుర్తుకు రావటంలేదు. ఇదేమిటి జుట్టంతా చెరిగిపోయింది. శుభ్రంగా దువ్వుకుని వేసుకున్న ముడి విడిపోయి, వీపుమీద పడి ఉంది—చచ్చిన పాములా.

రత్న మనస్సులో ఏదో గుర్తుకు వచ్చినట్టయింది. గబుక్కున లేచి కూర్చుంది. అవును, గది తనదే. గోడమీద తనూ, వాసూ తీయించుకున్న ఫోటోలు, తాను కుట్టిన డోర్‌కర్టెను, టేబుల్‌క్లాత్—అన్నీ తను తన ఇంట్లోనే ఉన్నట్టు చెపుతున్నాయి. కాని, తనలో ఏదో మార్పు వచ్చింది! అమూల్యమైనదీ, అపూర్వమైనదీ, తన ప్రాణంకన్నా మిన్న అనుకున్న వస్తువును దేన్నో తను కోల్పోయినట్టు అనిపిస్తోంది. కాని, పోయిన వస్తువేదో స్ఫురించటంలేదు. కళ్ళు అలవాటు చొప్పున గడియారంవైపు తిరిగాయి. చిన్నముల్లు తొమ్మిది దాటింది.

రత్న తన చైతన్యాన్నంతా కూడదీసుకుని పక్కమీదనుండి లేచి నిల్చుంది. పక్కమీదికి ఎలా వచ్చాను? అన్న ప్రశ్న మెదిలింది. రత్న ఏదో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ, పక్కవైపు చురచురా చూసింది. అర్ధచంద్రాకృతిలో తల్లో అమర్చుకున్న పూలమాల రెండుగా తెగి, పక్కమీద పడి ఉంది. అప్పుడే వికసించి సౌరభాన్ని వెదజల్లుతున్న మల్లెమొగ్గలు బరువైన వస్తువుకింద పడటంవల్ల

—44 వ పేజీ చూడండి

తెలుగు పత్రికలన్నిటిలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అధికమైనది

నరబలి

17-వ పేజీ తరువాయి

నలిగినట్లు కనిపిస్తున్నాయి. పక్కమీదినుండి ఓ మొగ్గ చేతిలోకి తీసుకుంది.

"ఛా, అన్యాయం, ముడికి అర్ధచంద్రాకృతిలో మాల అమరిస్తే ఆయన కెంతో ఇష్టం. ఈరోజు ఆయన రాకముందే అవి వాడిపోతున్నాయి."

ఆమెదృష్టి కొంగుపైపుకు వెళ్ళింది. కొంగు భుజంమీదినుండి జారి, పక్కమీద పడిఉంది. తెల్ల చుక్కలున్న నల్లటి బట్టమీద చీర కుచ్చిళ్లు సరిచేసుకుంది. క్రిందపడిన కొంగు తీసి రొమ్ముమీదుగా ఎడమ భుజంమీద వేసుకుంది. ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. 'ఏమిటిది? కొంగు సిగరెట్టు వాసనలో అద్దినట్టుంది. సిగరెట్టు కంపుతో బాటు, ఉన్మాదకరమైన సెంటువాసన కూడా వస్తోంది. సెంటువాసన, సిగరెట్టుకంపు తమింట్లోకి ఎలా వచ్చినయ్? తను ఎప్పుడూ సెంటు వాడి ఎరగదు. వాసు సిగరెట్టు ముట్టి ఎరుగడు. అయినా సిగరెట్టు, సెంటుల పరిమళం గదిని ఆక్రమించుకుంది. రత్న ప్రశ్నార్థకంగా చుట్టూ చూసింది. 'నలిగిన మొగ్గల వాసనే అలా అనిపిస్తోందా'? అనుకుంటూ కొంగువాసన మళ్ళీ చూసింది. 'ఖచ్చితంగా సిగరెట్టు కంపే. అయితే ఇంకెవరో ఇంటికి వచ్చిఉండాలి...... గడ్డకట్టిన మనస్సుమీద మరిగే నీళ్ళు చల్లినట్టయింది. రత్న కెవ్వున కేకవేసి, రెండు చేతులతోనూ మొహం కప్పుకుంది. ఆమె దేహం గడగడా వణికిపోయింది. "అయ్యో! ఎంతపని జరిగిపోయింది!" అని ఆమె హృదయం ఆక్రోశించింది. రత్న మంటలో పడిన తీగెలా అయిపోయింది. దుఃఖం పొర్లుకొచ్చింది. ఏడ్చి ఏడ్చి అలసిపోయింది. కాని, మనసులోని ఆవేదన తగ్గలేదు. కళ్ళలోని నీళ్ళంతా ఇంకిపోయాక, ఆమెకు తనమీద, వాసుమీద, ప్రపంచంమీదనే కోపం ముంచుకొచ్చింది. ఆ ఆవేశంలో చేతిలోని జేబురుమాలును చింపి ముక్కలుచేసి పారవేసింది.

గడియారం తొమ్మిదిన్నర కొట్టింది. గంట శబ్దం విని అదిరిపడింది రత్న. అది గడియారపు శబ్దమే. దానికి భయపడనక్కరలేదు.

రత్న గాజులులేని తన చేతిని చూసుకుంది. గదిలో పోట్లాట జరిగిన గుర్తులింకా ఉన్నాయి. పగిలిన గాజుముక్కలు క్రిందపడి ఉన్నాయి. కుర్చీ తలక్రిందులుగాపడిఉంది. చేతిలో గాజు గుచ్చుకున్న చోట రక్తం కారుతోంది.

రత్న ఏడుపు దిగమింగుకుని లేచింది. క్రిందపడి ఉన్న గాజుముక్కలను ఏరి, కిటికీలోనుండి బయట పారవేసింది. మల్లెమొగ్గలను ఏరి, చెత్తబుట్టలో వేసింది.

వాసుకు తన ఈ విషయం తెలిస్తే? ఆమె వంటిమీద మంచు కురిసినట్టయింది. భర్తకుమాత్రం ఎలా తెలుస్తుందా సంగతి? తను నోరు విడిచి చెపితే గదా! తను చెప్పకుండాఉంటే? ఓహో! ఎలా ఈ మలినదేహంతో అతనితో జీవించటం జరిగిందని, చెప్పేస్తే? ఊహూ. వాసు తనను తిరస్కరిస్తే ఏం చేయటం? ఇంత పెద్ద ప్రపంచంలో అతనుతప్ప

వేరెవరూ లేరు. తనకు. చెప్పకపోవటమే మంచిది. ఈ ఆరని మంట తనలోన ఉండనీ. దీని వేడి కూడా ఆయనకు తగలకూడదు. ఆయన మన్నిత హృదయం తట్టుకోలేదు. అయినా తన మొహంచూసి గ్రహిస్తే? రత్న అద్దంముందు నిల్చుని తన మొహాన్ని పరీక్షించు కుంది. విరిసిన పుష్పానికి అగ్నిచుంబనమయితే పుష్పం వాడిపోవటం ఎంతసేపు? ఆమె శరీరంలోనుండి, చీరెలోనుండి సిగరెట్టు, సెంటుల వాసన వస్తు న్నట్టనిపించింది. రత్న జుగుప్సతో మొహం ముడుచు కుంది. ఆమె పెదవులు, బుగ్గలు తేలు కుట్టినట్లు మండుతున్నాయి. తువ్వాలు భుజంమీద వేసుకుని నీళ్ళ గదివైపు నడిచింది.

వాసు ఇంటికి వచ్చే టైము దగ్గరపడుతున్న కొలదీ ఆమె మనస్సులోని వ్యాకులము ఎక్కువ కాసాగింది. ఒకవేళ వాసుకు తెలిస్తే ఏమవుతుంది? కోపంతో ఇంటినుండి వెళ్ళగొడతాడా? ఆయనకు తనంటే ఎంతో ప్రేమ. కాని, ఆ ప్రేమ ద్వేషంగా మారితే? ఉహుఁ. అతనికీ విషయం తెలిస్తే భరించ గలడా? అతనికోసమయినా తను చెప్పకపోవటమే మంచిది......ఆమె మనస్సు మంటలో పడినట్టుంది. "పసిబిడ్డలాటి హృదయం భర్తది. అతడికి ద్రోహం చేయటమా......"

"రత్నా......రత్నా.......తలుపు"

ఓహ్! ఆయన వచ్చేశారు! ఈ మొహం ఎలా చూపటం? నా నోటితో నేను చెప్పకపోయినా, నా మొహమే ఆయనకు అంతా చెప్పేస్తుంది అను కుంటూ, అద్దంలో తన మొహం చూసుకుంది. భయంతో చెదురుతున్న కళ్ళు, తెల్లబడిన మొహం, వణుకుతున్న కాళ్ళు! ఏదో జరిగిందని ఆయనకు తెలిసి పోతుంది. తప్పదు. ఏంచేయను? అనుకుంది.

"రత్నా......" వాసు తలుపు తడుతున్నాడు.

రత్న పెరటి తలుపువైపు చూసింది. ఆయన అక్కడుండగానే ఇటు తలుపు తీసుకుని వెళ్ళిపోనా? అనుకుంది. కాని, ఈ రూప యవ్వనాలతో ఎక్కడికి పోతుంది తను?

"ఓ రత్నా......"

ఏదో అవ్యక్తమైన శక్తిచేత ముందుకు తోయ బడి, వెళ్ళి తలుపు తీసింది రత్న. వాసు లోపలికి రాగానే లేనికోపం చూపుతూ, "రాణీగారికి నిద్ర వచ్చిందేమో" అన్నాడు అక్కడే కుర్చీమీద కూర్చుని బూటుదారాలు విప్పుతూ.

"......"

వాసు తల పైకెత్తి ఆమె మొహంవైపు చూశాడు. అతడి మొహంలోని నవ్వు మాయమయింది.

"ఏం రత్నా అలా ఉన్నావు? ఏమన్నా ఉత్తరా లొచ్చాయా? అంతా కులాసాయే గదా?"

"నా కెందుకో ఈ ఇల్లు ఇష్టంలేదు. వేరే ఇంటికి వెళ్ళిపోదాం" రత్న భర్తమాటకు జవాబు చెప్ప కుండా తనకు తోచింది మాట్లాడింది. వాసు ఆశ్చ ర్యంతో, "నా ప్రశ్నకు జవాబు రాలేదే?"

"ఈ ఇల్లు వద్దు. వెళ్ళిపోదాం."

"ఎందుకు? ఇప్పుడేమయిందీ ఇంటికి?" వాసు ఆమెనే అనుసరించి మాట్లాడాడు.

"ఈ కొండల్లో, గుట్టలలో ఒంటరిగా బ్రత కటం నా చేతకాదు."

"ఈ ఇల్లు బాగా లేదా?"

"ఇల్లేమో బాగానేఉంది. కాని, చుట్టూరా ఇళ్ళుంటేనే కదా మంచిది. పట్టపగలు తల పగల కొట్టినా అడిగేవాళ్ళుండ రిక్కడ."

"సరే చూద్దాం. వెతికి చూస్తాను."

"వెతికి చూస్తానంటేకాదు. ఇంకా నేను బ్రతికి ఉండాలని మీకు ఉంటే వెంటనే వేరేఇల్లు చూడండి"

"రత్నా!!"

రత్న మొహం త్రిప్పుకుంది.

"ఎందుకిలా మాట్లాడుతున్నావు? ఒంట్లో కులా సాగాఉందికదా?" అంటూ లేచివచ్చి, నుదుటిమీద చెయ్యివేసి చూశాడు వాసు.

రత్న విసురుగా చెయ్యితీసివేసి "వదలండి. నాకు చచ్చిపోయేంత జబ్బేమీ రాలేదు" అంది. ఆమె కంఠ స్వరాన్ని విని ఆశ్చర్యపోయాడు. వాసు దూరంగా జరిగి, భార్యవైపు పరీక్షగా చూశాడు. రత్న ఎప్పటిలా లేదు. ఏదో మార్పు వచ్చింది ఆమెలో. కొంతసేపు అలాగే చూస్తూ ఉండిపోయాడు. తరువాత మాట మారుస్తూ, "మల్లెపూలంటే నీ కెంతో ఇష్టం. మాలతెచ్చినా పెట్టుకోలేదేం?" అన్నాడు.

ఆ మాట శూలంలా గుచ్చుకుంది రత్నకు. వెంటనే తేరుకుని, "ఓ అదా! సంజీవరావుగారి భార్య వస్తే ఇచ్చాను...."

"అలాగా. మంచిదయింది. ఇవిగో కొత్త పూలు తెచ్చాను. పెట్టుకో" అంటూ సంచిలోనుండి పూలు పైకి తీశాడు.

రత్న విసుగ్గా, "ఉండనివ్వండి. ముందు మీరు భోజనానికి లేవండి" అంటూ ఇక అక్కడ ఉండకుండా వెళ్ళిపోయింది.

వాసు మాట్లాడకుండా వెళ్ళి, పీటమీద కూర్చు న్నాడు. మౌనంగానే భోజనం పూర్తయింది. అడిగిన దానికంతా రత్న ముక్తసరిగానే జవాబిస్తోంది. మజ్జిగ పోయటానికి వంగినపుడు ఆమె చేతిలో గాజులు లేకపోవటం గమనించాడు వాసు.

"గాజులు ఏమయ్యాయి రత్నా? గాయం కూడా అయినట్టుందే?" అన్నాడు ఆదుర్దాతో.

గొంతుదాటివస్తున్న సత్యాన్ని అతి ప్రయాసతో ఆపుకుని, "నీళ్ళు తోడేటప్పుడు కాలుజారిపడ్డాను. గాజులన్నీ పగిలిపోయాయి" అంది రత్న.

"ఏంపిల్లరా బాబూ, సరిగ్గా నడవటం కూడా చేతకాదు" అని నవ్వుతూ, ఆమె బుగ్గ గిల్లాడు. కళ్ళనుండి ప్రవహించేందుకు సిద్ధంగాఉన్న కన్నీ ళ్ళను అతడికి కనపడనీయకుండా మొహం ఇంకో వైపుకు త్రిప్పుకుంది రత్న.

వాసు తన భోజనం కాగానే, "నువ్వు కూర్చో రత్నా! నేను వడ్డిస్తాను" అన్నాడు.

"నాకు భోజనం చేయాలనిలేదు. ఒద్దు" అంది రత్న.

"కొంచెం నేనే తినిపిస్తాగా......" అన్నాడు వాసు.

"ఉహుఁ" అంటూ రత్న భర్తకన్నా ముందే బయటికి వచ్చేసింది. ఇక చేసేదిలేక అతడూ లేచి బయటకు వచ్చేశాడు. తమలపాకుల పళ్ళెం అతని ముందుంచి, గోడవైపు మొహం పెట్టుకుని పడు కుంది.

వాసు ఇక భరించలేకపోయాడు. పగలంతా శ్రమ పడి, అలసివచ్చిన అతడికి భార్య నవ్వుమొహం, సరసపు మాటలతో శ్రమంతా పరిహారమయ్యేది. ఆమె స్నేహంతో, ప్రేమలో అన్నీ మరిచి హాయిగా గడిపే వాడు. ఎప్పటి సరసం, చిరుకోపం లేకపోవటంతో ఆ రోజు రసవిహీనంగా కనపడింది. రత్న ఎప్పుడూ ఇలా ప్రవర్తించలేదు. ఏదో పెద్ద కారణమే ఉండి ఉండాలి అనుకున్నాడు.

గోడవైపు మొహంపెట్టి పడుకున్న భార్యను బలవంతంగా తనవైపుకు త్రిప్పుకున్నాడు. రత్న రెండు చేతులతోనూ మొహం కప్పుకుంది. వాసు ఆ చేతులు తీసివేయడానికి ప్రయత్నించాడు.

"లైటు వెలుగు భరించలేను. కళ్ళు మండు తున్నాయి" అంది రత్న.

"నావేపు చూడు" అంటూ ఆమె చేతులు తీశాడూ రత్న అతడి మొహం చూడటానికే భయపడింది.

"నామొహం చూడటానికే భయపడతావేమిటి? నేనేం పెద్దపులినికానే?" అంటూ ఆమె మొహాన్ని చేతులతో నిమిరి, నుదుటిమీదపడ్డ వెంట్రుకలను వెనక్కితోశాడు.

"ఇదేమిటి రత్నా? మొహంమీద గాయం? ఏమ యింది? ఎలా తగిలింది? బుగ్గమీద ఈ గుర్తేమిటి రత్నా? మందు వేయలేదుకదూ? సెప్టిక్ అయితే ఏం గతి? అస లింతకూ ఏం జరిగింది?"

"ఏంలేదు. సంజీవరావుగారి బాబు వచ్చాడు గదా! రానంటూంటే ఎత్తుకున్నాను. బాగా గిరే శాడు."

"పోనీ మందు వెయ్యకూడదూ? ఇకమీదట వాడిని ఎత్తుకోకు. వ్యాసలైన్ ఏదీ......పోనీ జాంబక్ ......" అంటూ హడావిడిగా గదంతా కలయ దిరిగాడు.

"ఏదీ వద్దులెండి. అదే పోతుంది."

వాసు ఆమె మాటలు వినకుండా జాంబక్ వెతికి తెచ్చి బుగ్గమీద రాశాడు.

"కొంచెం మంట తగ్గిందికదూ?"

"ఊఁ..."

ఓ నాటకం రిహార్సలు జరుగు తున్నాయి: "ఆమాట కర్థ మేమిటో తెలియటం లేదండి" నటుడు డైరక్టరుతో మొరపెట్టు కున్నాడు.

"ఆఁ అదీ! దారికి వస్తున్న మాట! నీకు, నాకు, దాని వ్రాసిన వాడికీ, దాన్ని విన్నవాడికీ అర్థం కాకపోతనే అది కళ. ఆ మాట కళాత్మకం. ఊఁ తే."

అని తాత్పర్యం చెప్పాడు దర్శకుడు. తారకేశ్వర రావు.

తారక రామారావు (తరిగొప్పుల)

నరబలి

"ఇక నా దగ్గరకు రావటానికేం అభ్యంతరం లేదుకదూ?"

"నాకు నిద్దరొస్తోంది" అంటూ రత్న ముసుగు నిండుగా కప్పుకుని పడుకుంది.

పడుకుందేగాని, నిద్రాదేవత ఆమె ఛాయలకు కూడా రావటంలేదు. అశాంతితో పక్కమీద పొర్లు తూనేఉంది. "విషం, పన్ను, విషం"

రత్న హృదయంలో చిచ్చుపెట్టినట్టుంది. నోరు విప్పి, జరిగిన విషయం భర్తతో చెప్పుకోటానికీలేదు. చెప్పకుండా ఉండటమూ చేతకావటంలేదు. అడ కత్తెరమధ్య చిక్కుకున్నట్టుగా నలిగిపోతోంది ఆమె కోమల హృదయం. పగిలిపోతున్న కణతలను రెండు చేతులతోనూ, గట్టిగా అదిమి పట్టుకుని, నిద్ర పోతున్న భర్తను దీనంగా చూసింది.

వాసు శాంతంగా నిద్రపోతున్నాడు. ప్రశాంత మైన వెన్నెలకాంతిలో అతడి మొహం స్పష్టంగా కనిపిస్తోంది. నిద్రాదేవి ఒడిలో విశ్రమిస్తున్న అతడి మొహంలో పసివాడి ముగ్ధత కనిపిస్తోంది. వాసు నిద్రలోనే కలవరించాడు.

"రత్నా......గాయం.....ఎందుకిలా ఉన్నావు?"

రత్న హృదయం ప్రేమతో పులకరించింది. నిద్రలోనూ అతడికి తన ధ్యాసే. ఓహ్! వాసు తన నెందు కింతగా ప్రేమిస్తున్నాడు. కొంచెం తక్కువగా ప్రేమించగూడదూ. నిద్రిస్తున్న అతడి మొహం అమాయకంగా, ముద్దుగా కనిపించింది. నుదుటిమీద ముద్దుపెట్టుకుందామని ముందుకు వంగిందామె. పిపాసతో నిండిన రెండు నల్లటి కళ్ళు వచ్చి వారిద్దరిమధ్యా అడ్డుగా నిలిచాయి. రత్న బెదరి, వెనుకకు తగ్గింది.

*   *   *

రత్న పట్టుదలవల్ల వాసు కష్టపడి చుట్టూ ఇళ్ళుఉండే చోట్లో వేరే ఇల్లు చూశాడు. ఇల్లు మారితేనైనా రత్న విచిత్ర ప్రవర్తన మారవచ్చునని ఆశించా డతడు. కాని, అదేమి ఫలించలేదు. కొత్త ఇంటికి వచ్చి, రెండు నెలలు దాటిపోయాయి. రత్న ప్రవర్తనలో ఎక్కువ మార్పేమీ రాలేదు. ఏదో పర్యధ్యానంగా ఉదాసీనంగా ఉండేది. ఒక్కోమారు భర్తనే అపరిచితవ్యక్తిని చూసినట్టుగా చూసేది. తను కడుపుతో ఉందన్న విషయం తెలియగానే పిచ్చిపట్టినంతపనయింది రత్నకు. మనసులో మెది లిన శంకతో ఆమె హృదయం విలవిలలాడింది.

'ఆ భయంకరరాత్రి పరిణామమే ఇది అయిఉంటే..? లేకపోతే తమ దేనేమో! తమ ఇద్దరి ప్రేమఫలమే కావచ్చును. మధురభావనతో ఆమె హృదయం విక సించబోయి, అంతలోనే ముకుళించింది. ఊహుఁ..... కానేకాదు. తన పెళ్ళయి నాలుగు సంవత్సరాలయినా ఇంతవరకూ పిల్లలు పుట్టలేదు. పుట్టేప్రాప్తి ఉంటే ఇంతకుముందే పుట్టాల్సింది. కాదు. కానేకాదు. పుట్టబోయేబిడ్డ తమదికాదు. తను మోస్తున్నది పాపఫలం. ఆ బిడ్డ పుట్టాక తన గతి శత్రువులకూ ఒద్దు. ఆ బిడ్డ మొహం అనుక్షణం ఆ దుర్ఘటనను, ఆ పాపి మోహాన్ని గుర్తుకు తెస్తూంటుంది. తప్పదు. దేన్నయితే తను మరిచిపోవడానికి ప్రయత్నిస్తోందో అది తనను ప్రాణం ఉండేవరకూ ఒదలదు. నిరం తరమూ తనముందు రూపందాల్చి, పెద్దదై తన కళ్ళముందే తిరుగుతుంది.

తుఫానులో చిక్కిన చిన్ని నావలా తల్లడిల్లింది ఆమె మనస్సు.

ఆరోజునుండి రత్న అతనికి మరింత దూరంగా ఉండసాగింది. తను ఏ జన్మలో ఏ పాపంచేసుకుందో ఇప్పుడు అనుభవిస్తోంది. అది ఆ రాత్రితోనే తీర లేదు. తనలోనే లీనమై, తనను సర్వనాశనం చెయ్య గలదని అనుకోలేదామె.

రత్న తల్లి కాబోతోందని తెలియగానే వాసుకు కలిగిన సంతోషానికి పారమే లేదు. "రత్నా, నీకు కొడుకు కావాలా, కూతురా?" అని అడిగిన వాసు తనలోని సంతోషభావాలనే ఆమె మొహంమీద చూస్తా ననుకున్నాడు. కాని, రత్న మొహంలో దుఃఖం, కలవరం చోటుచేసుకున్నాయి.

భర్త ఉత్సాహం, సంతోషంచూసి "ఎందు కనవ సరంగా సంబరపడుతారు? అది మీ బిడ్డకాదు" అని గట్టిగా అరవాలనిపించేది. దావానలంలా తనను దహిస్తున్న ఆ పాపపు బరువును లాగి బయట పార వేయాలనిపించేది.

"ఏంపిల్లా? మాట్లాడవు?"

"......"

పాలిపోయిన మొహం, కాంతిశూన్యమైన కళ్ళు, ముడివడిన కనుబొమలను చూసి చకితుడయ్యాడు వాసు. భార్యదగ్గరగా వచ్చి, ఆమె చేతులు పట్టుకుని మృదువుగా, "ఏం, నీకు పిల్లలు కావాలనిలేదా?" అన్నాడు. రత్న చేతులు వదిలించుకుని, గదిలోకి పారిపోయి తలుపు వేసుకుని, పక్కమీదపడి ఏడవ సాగింది. రత్న ఏడుస్తోందని తెలుస్తూనే ఉంది వాసుకు. కాని, ఎంత తలుపుతట్టినా, రత్న తలుపు తెరవలేదు.

అయితే రత్నకు పిల్లలు కావాలనిలేదా? తనకు తల్లి కావటం ఇష్టంలేదా? కాపురానికివచ్చి నాలుగే ళ్ళయినా తనకు పిల్లలు పుట్టలేదని రత్న ఎన్నో మార్లు చిన్నబుచ్చుకుంది. ఆ బెంగ పోగొట్టటానికి తను "మనం ముసలివాళ్ళం కాలేదుగా" అనేవాడు. ఈ సుదినంకోసమే తామిద్దరూ ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నప్పుడు రత్న ఇలా ప్రవర్తించటం అతడిని ఆశ్చర్యపరిచింది.

గర్భంతోపాటు, ఆమె మనోవ్యథ, బెంగ కూడా పెరగసాగింది. ప్రతిక్షణమూ బిడ్డ ఎవరిది అన్న జిజ్ఞాస ఆమెను పీడిస్తోంది. జబ్బేమీ లేకుండానే రత్న కృశించిపోసాగింది. భర్త ఆమెకు ఏ విషయం లోనూ లోటు కలుగనివ్వలేదు. పాలు, పళ్ళు బల వంతాన తినిపించేవాడు. కాని, భార్య రోజు రోజుకూ ఎముకలపోగై పోతూంటే చూడలేకపోయేవాడు.

మంచి పుస్తకాలు

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:-...... ..రూ 3-50
యువతి:- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు..........రూ: 3-50.
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు................రూ 3 50
ఆధ్యాత్మిక రహస్యాలు:- వ్యాపారంతో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు. రూ 6-00
ఉద్యోగదర్శిని:- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు.రూ5-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోష్టు ఖర్చులుచితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును.

దేశసేవ ప్రచురణలు, ఏలూరు

మంచి రహస్యం

గ్లోరియా ద్రవాన్ని, మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును, ముఖంలో ముడతరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును ఎండకువచ్చే నలుపును, మొటిమలను నమ్మకంగా పోగొట్టును. వెల రూ. 1-73. అన్ని షాపుల్లో దొరుకును.

JANITA PRODUCTS, ELURU. A.P.



కీళ్ల వాతము, వాపునొప్పులు కండరవాపులూ అలసట మూలంగా కలిగే బాధలకు, స్లోఅన్స్ లినిమెంట్ ఉపయోగించండి. స్లోఅన్స్ మీ నొప్పులను తక్షణం దూరంచేస్తుంది.

వార్నర్-లాంబర్ట్
ఫార్మస్యూటికల్ కంపెని
(మితబాధ్యతలతో యు.ఎస్.ఎ.లో స్థాపితము)

TEI

ప్రేమగా ప్రతిమాలుకుంటూ ఎన్నో విధాలుగా అడిగిచూశాడు. కాని, రత్న పెదవి కదపలేదు. భార్య ఏదో బాధపడుతోందనిమాత్రం అతడికి స్పష్టమయింది. అదేమిటో ఎన్ని విధాలుగా బుజ్జగించినా, రత్న చెప్పలేదు. సాధ్యమయినంతవరకూ రత్నను ఒంటరిగా వదిలేవాడుకాదు. ఒకరోజు శూన్యంలోకి చూస్తూ తన ఆలోచనా సముద్రంలోనే మునిగిపోయిన రత్నను తట్టిలేపి, "పద రత్నా, మంచి పిక్చరొచ్చింది. వెడదాం" అన్నాడు.

"నేను రాను. మీరు వెళ్ళండి" అంది రత్న ముభావంగా. వాసుకు ఇలాంటి జవాబులు ఈమధ్య బాగా అలవాటయిపోయాయి.

"నువ్వు రాకపోతే నేను మాత్రం వెళ్ళటం దేనికిలే" అని చిన్నబుచ్చుకున్నాడు. వాసు మొహం చూసి, రత్నకు జాలివేసింది. అతడికి తనమీదున్న ప్రేమా, తనను ఎలాగైనా సంతోషపెట్టాలని అతడు పడుతున్న శ్రమా రత్నకు తెలియిందేమీకాదు. తన మనసులోని బాధ నణచుకోలేక ఈమధ్య చాలా మార్లు అతడి ఇష్టానికి విరుద్ధంగా ప్రవర్తించి, అతిడిని నొప్పించింది. అలా చేసినప్పుడల్లా అంతకు రెట్టింపుగా బాధపడేది తనూ. నిరాశతో నిండిన అతడి మొహంచూసి, "పదండి వెడదాం" అంది.

వాసు సంతోషానికి పారమే లేదు. పదపదమని హడావిడి చేశాడు.

"రత్నా, ఆ తెల్లచుక్కలున్న నల్ల చీర కట్టుకుని తెల్లటి చోళీ వేసుకో. అది నీకెంతో బాగుంటుంది. ఈమధ్య నువ్వు కట్టుకున్నట్టు లేదు."

ప్రేమతో భర్త దగ్గరగా వచ్చి నిల్చున్న రత్న సర్పదర్శనమయినట్లు ఒక్కడుగు వెనక్కువేసింది.

"ఆ చీర చిరిగిపోతే పనిమనిషి కిచ్చేశాను."

"అదేమిటి రత్నా, అది కొని ఇంకా ఆరునెలలు కూడా కాలేదు. అప్పుడే చిరిగిపోయిందా?" అన్నాడు. వాసు ఆశ్చర్యంతో.

"అవును. ఆ చీరె చిరిగిపోయింది" అంది రత్న. నా మాట మీరు నమ్మి తీరాల్సిందే అన్నట్టుంది ఆమె మాట్లాడిన తీరు—అందులో సహజత్వంలేదు. ఆమె అంతరంగాన్ని చీల్చి చూస్తున్నట్టుగా సూటిగా చూశాడు వాసు. ఆ తేనెరంగు కళ్ళలోని తీక్షణతను భరించలేక రత్న అక్కడినుండి వెళ్ళిపోయింది.

పురుటిరోజు దగ్గర పడుతున్నకొలది రత్న ఆవేదన తీవ్రం కాసాగింది. 'బిడ్డ భర్తలాఉంటే తన హృదయం మీదనుండి పెద్ద భారం దించినట్టవుతుంది. తేనెరంగు కళ్ళు, అంత నలుపుకాని జుట్టు, ఎర్రటి దేహచ్ఛాయ.....బిడ్డ భర్తలా ఉండదు. అతని దయితేకదా అతనిలా ఉండటానికి' నల్లటి కళ్ళు, నల్లని వెంట్రుకలు, నల్లటి ఒంటిరంగు కల బిడ్డ అస్పష్టంగా ఆమె కళ్ళఎదుట గోచరించింది. ఆమె అసహ్యంతోనూ, భయంతోనూ వణికిపోయింది.

ప్రసవవేదనకన్నా, మనోవేదనే ఆమెను ఎక్కువ బాధ పెట్టింది. అంత బాధలోనూ, ఆమె డాక్టర్లు,

నర్సుల మొహాల్ని పరీక్షగా చూస్తోంది. అందరూ తనను నీచంగా చూస్తున్నట్టే అనిపించింది. నర్సులిద్దరు ఏదో నెమ్మదిగా మాట్లాడుకొని చిన్నగా నవ్వుకున్నారు. 'ఇంకేముంటుంది తనను గురించే అనుకుని ఉంటారు. ఈమె పతిత. ఈ పుట్టబోయే బిడ్డ ఈ భర్తదికాదు' అనేఉంటారు.

"ఏమండీ రత్నా! పాపాయి మీలాగానూ లేదు, మీవారిలాగానూ లేదు. ఎవరి పోలికండి?" అని పక్కింటి కమలగారు అడిగితే? గదిలోని ప్రతి వస్తువూ తనను వెక్కిరిస్తూ, హేళనగా నవ్వుతున్నట్టనిపించింది. ఇక భరించలేక కెవ్వున కేకవేసింది.

మళ్ళీ తెలివి వచ్చేటప్పటికి రత్నకు బాధేమీ లేదు. అంతా నిశ్శబ్దంగాఉంది. ప్రశాంతమైన నిశ్శబ్దం అది. రత్న కిటికీగుండా చూసింది. నీలాకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. అయితే బిడ్డ

భార్య చేసిన పిండివంటలు తింటూ "చాలా బాగున్నా యనక తప్పదు" అని మెచ్చుకున్నాడు పరంధామయ్య.

"ఏ న్నాయనా! అంత బాగున్నవా పదార్థాలు" ఆప్యాయంతో అడిగింది తలుపు చాటున నిల్చున్న అత్తగారు.

"అబ్బే! బాగున్నా యనలేదండీ! "బాగున్నా యనక తప్పదు అని మాత్రం అన్నాను" భార్యవేపు బిక్కుబిక్కు మని చూస్తూ సమాధానం చెప్పాడు పరంధామయ్య.

రామారావు (గుంటూరు.)

పుట్టి, ఎన్నో గంటలయిఉంటుంది. రేపు తననూ, బిడ్డనూ చూడవచ్చే భర్తకు మొహం ఎలా చూపటం? ఆమె కన్నీళ్ళతో తలగడ తడిసిపోయింది. కాని సమస్య పరిష్కారం కాలేదు.

ఉదయం ఆరుగంటలకే వాసు ఫ్లాస్కులో కాఫీ తీసుకుని వచ్చాడు. వాసు రావటం అంతదూరంలో ఉండగానే గమనించిన రత్న మెదలకుండా కళ్ళు మూసుకుని పడుకుంది. ఇంకేం పిడుగులాంటి ప్రశ్న తనమీద విరుచుకుని పడుతుంది అని ఎదురు చూస్తోంది రత్న.

"రత్నా"

వాసు ధ్వని మృదువుగా ఉంది. అందులో కసి నత్తువు ఛాయలు కూడా లేవు.

తన్ను చూసి జాలిపడు తున్నాడు. అంతే అనుకుంది రత్న కళ్ళు తెరచింది. భర్తవైపుకు చూసే ధైర్యంలేక కప్పుకేసే చూస్తోంది.

"రత్నా! బిడ్డను గురించి బెంగపెట్టుకోకు. బిడ్డ ఏడిస్తే నీ నిద్ర చెడుతుందని వేరేచోట పడుకోబెట్టారు. నేను నిన్న సాయంకాలమే చూశాను. ఆరోగ్యంగా ఉన్నాడు. ఎనిమిదిన్నర పౌన్లు ఉన్నాడు మన బాబు. నీకు రాత్రి బాగా నిద్రపట్టిందా? కులాసాగా ఉన్నావుకదా?" అన్నాడు సంతోషంతో పొంగిపోతూ.

"బిడ్డమీది ఎలా అవుతుంది? నా పాపఫలం" అని భర్తతో చెబుదామనుకుంది. అంతలోనే బిడ్డను తెచ్చి నెమ్మదిగా రత్న పక్కలో పడుకోబెట్టింది నర్సు. రత్న బిడ్డను చూడటానికే భయపడి ఇంకోవైపుకు తిరిగింది.

"నీ కొడుకును చూడు రత్నా! ఎలా ఉన్నాడో?"

రత్న బలవంతాన తలత్రిప్పి ఒక్కసారి బిడ్డను చూసినట్టుచేసి అటు తిరుక్కుంది. అస్పష్టంగా కన్పించిన బిడ్డ రూపు ఆమెలో సంశయాన్ని రేపింది. తనలోని చైతన్యాన్నంతా కూడదీసుకుని మళ్ళీ చూసింది.

"తేనెరంగు కళ్ళు, అంత నలుపుకానిజుట్టు, ఎర్రటి దేహచ్ఛాయ, భర్తకు ఉన్నట్టుగానే బుగ్గమీద నల్లటి మచ్చ....."

దేహం పట్టుతప్పింది. రత్న పిచ్చిదానిలా ముందుకు వంగి రెండు చేతులతోనూ బిడ్డను ఎత్తుకుని గట్టిగా హృదయానికి హత్తుకుంది. ఆమె గట్టిగా పట్టుకోవటంతో బిడ్డ చేతులూ, కాళ్ళూ కొట్టుకుంటూ ఏడవసాగింది. అదేమీ గమనించకుండానే రెండురోజుల పసివాడిని గట్టిగా పట్టుకుని ముద్దుపెట్టుకుంటూ, "బిడ్డ మనదే......మనదే...... మన బిడ్డే......" అంది.

ఆమె కంఠస్వరం క్షీణిస్తోంది. ఆఖరి మాట గొంతులోనే ఉండిపోయింది. బిడ్డను పట్టుకున్న ఆమె చేతులు తమ శక్తిని కోల్పోయాయి. బాబు ఆమె ఒళ్ళోనుండి జారిపోయాడు. నర్సు పరిగెత్తుకుంటూ వచ్చి బిడ్డను ఎత్తుకుని ఓదార్చసాగింది. వాసు కంగారుగా "రత్నా, రత్నా" అని పిలిచాడు.

రత్న ఏదో చెప్పటానికి ప్రయత్నించింది. కాని, ఆమె నోటినుండి శబ్దం వెలువడలేదు. పెదిమలు చలించాయి. రత్న తన హృదయంలోని ప్రేమనంతా కళ్ళల్లో నింపుకుని అతనివైపు చూసింది. ఆమె కళ్ళల్లో మరణయాతన అనుభవిస్తూన్న ఛాయలున్నా, పెదిమలు తృప్తితో నవ్వుతున్నాయి. మొహంలో ఇన్నిరోజులూ కనిపించని శాంతి, తృప్తి, సంతోషం తాండవిస్తున్నాయి. రత్న తన చేతిని వాసు చేతిమీద పెట్టింది. "మన బిడ్డ" అన్న మాటలు ఆమె నోటినుండి అతి ప్రయాసతో వెలువడ్డాయి. ఆమె కంటినుండి ఒక్క చుక్క కన్నీరువడి బుగ్గమీదుగా జారిపోయింది. భర్తను చూస్తున్నట్టుగానే ఆమె కళ్ళు మెల్లిగా మూతపడ్డాయి. ★